క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన'

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఆర్డీవో రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శంకరబాబు ఆదివారం తెలిపారు. సమస్యలపై ప్రజలు అర్జీలు అందిస్తే ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

మహాసభ కరపత్రం ఆవిష్కరణ

నందిగామ: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జన జాగృతి మహాసభకు సంబంధించిన కరపత్రాలను మండలంలోని చందాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు దొండపాటి సుధాకర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో జూలై 7వ తేదీన జరగనున్న జన జాగృతి మహాసభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కనకపుడి వెంకటరత్నం, గుండె పోగు రాముడు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా విధింపు

కంచికచర్ల: మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్, జుజ్జూరు రోడ్డులో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈమేరకు ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలను నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, అతి వేగంగా, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపకూడదని చెప్పారు. వాహనాలు నడిపే సమయంలో కుటుంబసభ్యులున్నారని గుర్తుంచుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించటం వల్ల ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదగా ఉండాలని వారి నుంచి ఫిర్యాదు వస్తే డ్రైవర్లపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయరాదని చెప్పారు. సంబంధిత పత్రాలు లేని 14 మంది వాహనదారులకు రూ.1,650 జరిమానా విధించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

30 లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ మినహాయింపు

జగ్గయ్యపేటఅర్బన్: ఆస్తి పన్ను చెల్లించాల్సిన యజమానులు 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి అర్ధ సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి పన్నులపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేకుండా చెల్లించే అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ మల్లేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈనెల 30వ తేదీ లోగా ఆస్తి పన్ను చెల్లిస్తే వడ్డీ మినహాయింపు సౌకర్యం ఉంటుందన్నారు. పన్నులు చెల్లించాల్సిన వారు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కౌంటర్ వద్ద గాని, సంబంధిత వార్డు సచివాలయంలో గాని, ఆన్‌లైన్‌లో గాని చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి



తిరువూరు: దేశంలో మూఢ నమ్మకాలు పెరుగుతున్నాయని, వాటిని విడనాడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూఢనమ్మకాలు–సైన్స్ అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పాఠ్యాంశాల్లో సైన్స్‌కు సంబంధించిన అంశాలను తొలగించడం, శాస్త్రీయ పరిశోధకులకు ఇచ్చే పురస్కారాలు రద్దు చేయడం విచారకరమన్నారు. జేవీవీ సభ్యులు హరికృష్ణ, రాంప్రదీప్, నాగేంద్రప్రసాద్, సుదర్శన్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాజ సేవకు పునరంకితం కావడం ద్వారా సంతృప్తికర జీవితాన్ని పొందాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవత సంస్థ నగర శాఖ వార్షిక సమావేశం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరిగింది. సంస్థ అధ్యక్షుడిగా ఇమ్మానేని కృష్ణ ప్రసాద్, కార్యదర్శిగా దావులూరి సాంబశివరావు, సంస్థ ప్రాంతీయ అధ్యక్షుడిగా చెరుకూరి బాబు, చైర్మన్‌గా వేమూరు బాబూరావు కోశాధికారిగా పగిడిపల్లి రాములను ఎంపిక చేశారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు



ప్రభుత్వాస్పత్రి (నాడు)



ఆధునికీకరించిన పేట ప్రభుత్వాస్పత్రి(నేడు)

- పేట ఆస్పత్రిలో నాడు ఇద్దరే డాక్టర్లు – నేడు 13 మంది వైద్యులు
- నాడు–నేడు ద్వారా రూ.3 కోట్లతో సౌకర్యాలు

జగ్గయ్యపేటఅర్బన్: దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా వైద్య, ఆరోగ్య రంగంలో నియామకాలతో పాటు పెద్ద ఎత్తున మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. గత నాలుగేళ్లుగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత అనే మాటకు తావు లేకుండా చర్యలు తీసుకోవడం మొదలుపెట్టింది. నాడు–నేడు ద్వారా వసతులతో తీర్చిదిద్దింది. పదవీ విరమణ తదితర కారణాలతో ఖాళీ అయ్యే పోస్టులను ఎప్పటికప్పుడు గుర్తించి భర్తీ చేసేలా అత్యవసర అనుమతులు ఇచ్చింది. కేవలం వైద్యశాఖలో పోస్టుల భర్తీ కోసమే ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటుచేశారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో నాడు ఇద్దరే వైద్యులు, 30 పడకలతో తీవ్ర ఇబ్బందులు పడిన పేట ప్రభుత్వాస్పత్రిలో నేడు 13 మంది వైద్యులతో కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నే రీతిలో ఆధునిక వైద్య సేవలను అందిస్తున్నారు. కాగా నేడు 13 మంది వైద్యులతో 30 పడకల స్థానంలో 50 పడకలు మంజూరై విజయవాడ తరువాత ఎక్కడా లేని విధంగా డయాలసిస్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్, 24 గంటలు పనిచేసే బ్లడ్ స్టోరేజ్ యూనిట్, అంబులెన్స్ వంటి సౌకర్యాలతో అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోంది. అలాగే నాడు చాలీచాలని ఇరుకు గదులతో కునారిల్లుతున్న రోగులకు నేడు నాడు–నేడు పథకం ద్వారా నాబార్డు నిధులతో రూ.3 కోట్ల వ్యయంతో విశాలమైన భవన నిర్మాణంతో వివిధ విభాగాలకు గదుల ఏర్పాటు, ఆధునిక సాంకేత పరిజ్ఞానంతో కూడిన వైద్య సౌకర్యాల ఏర్పాటుతో సామాజిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న పేట ప్రభుత్వాస్పత్రి నేడు కార్పొరేట్ స్థాయి ఆస్పత్రుల వరుసలో నిలిచింది.

నవ్యాంధ్ర రాష్ట్రానికి ముఖ ద్వారంగా, వివిధ పరిశ్రమలతో పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందుతున్న జగ్గయ్యపేట పట్టణంలో సుమారు 60 వేల మంది జనాభా ఉన్నారు. అలాగే పేట పట్టణానికి ఆనుకుని, నియోజకవర్గం పరిధిలో 30 కి.మీ. మేర 65వ నంబర్ జాతీయ రహదారి కలిగి ఉంది. దీంతో నిత్యం జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాలతో క్షతగాత్రులను మొట్టమొదట పేటలోని ప్రభుత్వాస్పత్రికే తీసుకురావాల్సి రావడంతో పేట ప్రభుత్వాస్పత్రిపై తీవ్ర ఒత్తిడి పెరుగుతూ వస్తోంది. ప్రతి రోజు 200 నుంచి 300 మంది అవుట్ పేషెంట్లు, 10 నుంచి 20 వరకు మెడికో లీగల్ కేసులు(ఎంఎల్‌సీ), తరచూ పోస్టుమార్టం కేసులు వస్తుంటాయి. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయినప్పటికీ పూర్తి స్థాయిలో వైద్యుల నియామకం చేయవలసి ఉండగా గత ప్రభుత్వాల హయాంలో ఆ దిశగా ఎటువంటి పురోభివృద్ధి జరగలేదు. 2019లో పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీ గా అప్‌గ్రేడ్ అయినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క సౌకర్యం కూడ పెరగలేదు. ఆస్పత్రి స్థాయి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి వైద్యవిధాన పరిషత్‌కు మారిందే తప్ప ఆచరణలో మాత్రం పాత పద్ధతే కొనసాగుతూ వచ్చింది. ఈ క్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేట ప్రభుత్వాస్పత్రి సామర్థ్యాన్ని, స్థాయిని పూర్తిగా పెంచాలని పట్టుబట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో నాబార్డు నిధుల కింద రూ.3 కోట్లతో అదనపు భవన నిర్మాణం చేపట్టారు. అలాగే ఆస్పత్రి స్థాయిని 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయించడంతో పాటు వైద్య సిబ్బందికి కొరత లేకుండా అన్ని విభాగాలకు పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించేందుకు కృషిచేశారు.

డయాలసిస్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు..

కరోనా కష్టకాలంలో ఆక్సిజన్ సౌకర్యం లేక సుదూర ప్రాంతాలకు పేషెంట్లు వెళ్లాల్సి రావడంతో పేట ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ఎమ్మెల్యే ఉదయభాను రామ్‌కో సిమెంట్స్ వారి సహకారంతో పాటు ప్రభుత్వం, ఇతర దాతల సహకారంతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. అలాగే జిల్లాలో విజయవాడకు ఇవతల పశ్చిమ కృష్ణాలో కిడ్నీ పేషంట్లకు డయాలసిస్ సౌకర్యం లేక పేట ప్రాంత కిడ్నీ రోగులు విజయవాడ వంటి పట్టణాలకు తరచూ వెళ్లాల్సి వచ్చేంది. అనేక మంది ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతుండటంతో ఎమ్మెల్యే ఉదయభాను స్థానిక కోహన్స్ లైఫ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ వారి సహకారంతో సుమారు రూ 1.25 కోట్ల తో అపోలో కంపెనీ వారు నిర్వహణతో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయించారు.

సకల సౌకర్యాలతో వైద్యం అందిస్తున్నారు



గతంలో పేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటే పెచ్చులూడిపోయిన స్లాబులతో, పిచ్చిమొక్కలు, గడ్డితో కూడిన ఆవరణ, అపరిశుభ్ర వాతావరణం, కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్లు లేని దుస్థితి. కనీసం ఎక్స్‌రేకు కూడ బయటకు పోవాల్సివచ్చేది. ఇక్కడికి రావాలంటేనే రోగులు వణికుపోయేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని విభాగాలకు డాక్టర్లు వచ్చారు. కుర్చీలు, ఓపీ గదులు, 50 పడకలతో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వైద్య సేవలకు జనం క్యూ కడుతున్నారు.

– బి.నాగరత్నం, జగ్గయ్యపేట పట్టణ వాసి

అందుబాటులో అన్ని విభాగాల వైద్యులు



ప్రస్తుతం ఆస్పత్రిలో అన్ని విభాగాలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. సుమారు 40 ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్న మత్తు వైద్యుడు వచ్చారు. అలాగే అంబులెన్స్, స్కానింగ్, డిజిటల్ ఎక్స్‌రే తదితర కార్పొరేట్ హాస్పిటల్స్ స్థాయిలో అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆర్థోపెడిక్ వైద్యుడు లేక గతంలో ఎముకలు విరిగితే ఇక్కడ డాక్టర్లు లేరని పేషెంట్లంతా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడం గాని, విజయవాడ గాని వెళ్లేవారు. నేడు ఆ పరిస్థితి లేదు.

– డాక్టర్ హరీష్, సూపరింటెండెంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, జగ్గయ్యపేట

భక్తుల సౌకర్యార్థం మెరుగైన సేవలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ ఉదయభాను, ప్రజాప్రతినిధులు, అధికారులు

పెనుగంచిప్రోలు: భక్తుల సౌకర్యార్థం మెరుగైన సేవలు కల్పిస్తామని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. సుబ్బాయిగూడెం రోడ్డులోని మైత్రి రోడ్డు నుంచి శ్రీతిరుపతమ్మ వారి ఆలయం ముందు కల్యాణ వేదిక స్థలం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దర్శనానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు, వందల సంఖ్యలో వాహనాలు వస్తుండటంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్య పెరిగిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యల్లో భాగంగా ఈరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని చెప్పారు. పనులు వెంటనే ప్రారంభిస్తారన్నారు. అలాగే కాజ్‌వే పక్క నుంచి మైత్రి రోడ్డు వరకు మునేరు పక్కన కరకట్ట నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని పరిశీలించి నిర్వాహకులు వాసిరెడ్డి బెనర్జీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, శ్రీకనదుర్గ ఆలయ డైరెక్టర్ నంబూరి రవి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఆలయ ఈఈ వైకుంఠరావు పాల్గొన్నారు.

మల్లేలకు రూ.15 కోట్ల సంక్షేమ నిధులు

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో భాగంగా తిరువూరు మండలం, మల్లేలలో 932 కుటుంబాలకు రూ.15కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. మల్లేలలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన కుటుంబాలను కలిసి వారికి అందుతున్న పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లు అందజేశారు. 2019 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలను మంజూరు చేశామని, మల్లేల గ్రామంలో 90 శాతం కుటుంబాలలోని 4,118 మంది లబ్ధిదారులకు 22 పథకాల ద్వారా ప్రయోజనం కలిగిందన్నారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ కూడా ప్రారంభించామని, అంతర్గత రహదారుల అభివృద్ధికి, తాగునీటి అవసరాలకు కూడా ప్రాధాన్యం ఇస్తామన్నారు. గ్రామ సర్పంచ్ వంగూరు మరియమ్మ, పీఏసీఎస్ చైర్మన్ రవికుమార్, ఏఎంసీ చైర్మన్ నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, విస్సన్నపేట జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్ సీపీ నాయకులు ఏసుపాదం, రవికుమార్, కృష్ణారావు, నాగేశ్వరరావు, నెహ్రూ పాల్గొన్నారు.

పేద ముస్లింలకు నిత్యావసరాల పంపిణీ



ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు అందిస్తున్న నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు పేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. లబ్బీపేట గ్రీన్‌ల్యాండ్స్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్ మీరా పాల్గొని పేదలకు చీరలు, గోధుమపిండి, బియ్యంలతో కూడిన ప్యాక్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఒక్కో నియోజకవర్గంలో తాము సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, హజ్ యాత్రికుల కూడా సౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆ కమిటీ తూర్పు అధ్యక్షుడు షేక్ కలందర్, ఎండీ జహీరుద్దీన్, రఫీ, భాష తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రధాన ధ్యేయం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

చంద్రాల(మైలవరం): రైతు శ్రేయస్సే సహకార సంఘాల ప్రధాన ధ్యేయం అని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో నిర్మించిన నంబర్ హెచ్ 1290 ది చంద్రాల విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ సొసైటీ భవనాన్ని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, గుమ్మడపు రవీంద్రరాణాలతో కలిసి ఎమ్మెల్యే వసంత ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకుండా రుణాలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే సహకార సంఘాల ముఖ్య ఉద్దేశమన్నారు. రైతుల ఆర్థిక స్వావలంబన కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు.

వారాహిదేవి అలంకారంలో కాళీమాత

కృష్ణలంక(విజయవాడతూర్పు): శోభకృత్ నామ సంవత్సర ఆషాఢ మాసం సందర్భంగా వారాహి నవరాత్రులను పురస్కరించుకొని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత ఆదివారం వారాహిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆషాఢమాసం తొలి ఆదివారం కావడంతో భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని బోనాలు, సారె సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయకిరణ్ పర్యవేక్షించారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం



కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని వాసవీ క్లబ్ విజయవాడ చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఐఈసీ ఆఫీసర్ ఓలేటి శ్రీనివాసగుప్తా, కో ఆర్డినేటర్ పెరుమాళ్ల హరనాథ్ అన్నారు. ఆదివారం కృష్ణలంక, మెట్లబజార్‌లోని వాసవీ కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ విజయవాడ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ అనే రైతుకి క్రిమిసంహారక మందు స్ప్రే మిషన్, నాలుగు పేద కుటుంబాలకు రూ.6వేలు విలువైన నిత్యావసర సరుకులు, 10 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం మిలటరీ సైనికుడు ఎం.కోటిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాన్ టు డస్క్ చైర్మన్ పచ్చిపులుసు సాయిబాబు, వాసవీ క్లబ్ విజయవాడ అధ్యక్ష, కార్యదర్శులు తడికమళ్ల వెంకట సురేష్‌బాబు, వై.వి.వి.సత్యనారాయణ మూర్తి, కోశాధికారి బాలభాస్కర శేషగిరిరావు, రీజియన్ చైర్‌పర్సన్ ఎస్.సూర్యప్రకాష్‌రావు, సెక్రటరీ కె.బి.శివప్రసాద్, జోన్ చైర్‌పర్సన్ ఆత్మకూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, నాగేశ్వరరావు తదితరులు

పెనుగంచిప్రోలు: ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ ఆవరణలో శంకర కంటి ఆస్పత్రి, పెదకాని, కేడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కొమ్మినేని రవిశంకర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం వైద్యానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. ప్రతి పేదవాడికి ఆరోగ్య పరంగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ఇంటి వద్దకే వైద్యులు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని కొనియాడారు. శిబిరంలో పరీక్షలు చేయించుకుని శస్త్ర చికిత్స అవసరమైన వారిని ప్రత్యేక వాహనంలో శంకర ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, కేడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పి.దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు గింజుపల్లి నరసింహారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, డీసీఎంఎస్ డైరెక్టర్ గింజుపల్లి రవికుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



ఈద్గా ఆవరణలో మొక్క నాటుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: రోజురోజుకు పెరిగిపోతున్న వాతావరణ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ రూ.50 వేల వ్యయంతో కడియం నుంచి తెప్పించిన 250 మొక్కలను జామియా మసీదు పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక బలుసుపాడు రోడ్డులోని ఈద్గా ఆవరణలో పలు మామిడి మొక్కలను ఆదివారం ఎమ్మెల్యే ఉదయభాను నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటి వదిలివేయకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా ముస్లింలు తీసుకోవాలన్నారు. మనిషి ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉండాలంటే చెట్లు అవసరమని చెప్పారు. నాటిన ప్రతి ఒక్క మొక్క సంరక్షణకు ట్రీ గార్డ్స్ ఏర్పాటుచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మొహిద్దీన్, జామియా మసీదు ప్రెసిడెంట్ షేక్ జలీల్, వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్, కమిటీ సభ్యులు సయ్యద్‌అలీ, అల్లా భక్షు, రహంతుల్లా పాల్గొన్నారు.

వైభవంగా వారాహిదేవి నవరాత్రులు



గాయత్రి మాతకు సారె సమర్పించేందుకు వస్తున్న భక్తులు



సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలోని అగస్త్య పీఠంలో ఆషాఢమాసం వారాహి దేవి గుప్త నవరాత్రుల వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గాయత్రి అమ్మవారికి సారె సమర్పించారు. ముందుగా పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ముందుగా అర్చకులు ఫణీంద్రాచార్యులు, రాజేష్ ఆచార్యులు, సతీష్ శర్మలు మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. అనంతరం పీఠం ఆవరణలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు శీలం రమణారెడ్డి, నాయకులు పచ్చాల కోటేశ్వరరావు, సుభాని, పసుపులేటి సాయిబాబు, పొల్లేపల్లి వెంకటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో గ్రామాల అభివృద్ధి

చంద్రాల: మైలవరం నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో నూతన సొసైటీ భవన ప్రారంభోత్సవం అనంతరం ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడారు. సహకార సంఘం భవనానికి రూ.32 లక్షలు, లాకర్లకు మరో రూ.5లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు–నేడు పథకం కింద రూ.1.20 కోట్లతో అన్ని పాఠశాలలు భవనాలు నిర్మించామన్నారు. రూ.95 లక్షలతో సీసీ రహదారులు, రూ.65 లక్షలతో డ్రెయినేజీలు నిర్మించామన్నారు. రూ.62 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధునీకరణ, మరో రూ.8 లక్షలతో స్కూల్ భవనం పూర్తి చేసినట్లు వెల్లడించారు. సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలు చివరి దశకు చేరి, తుది మెరుగులు దిద్దుకుంటున్నాయన్నారు. గ్రామంలో 380 మంది పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలను మంజూరు చేశామన్నారు. ఎస్టీలు 14 మందికి గృహ నిర్మాణాలకు ఎస్టీ వెల్ఫేర్ కార్పొరేషన్ నుంచి రూ.63 వేల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. తుమ్మల గన్నవరంలో రూ.25 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు. నీతి నిజాయతీతో నియోజకవర్గం అభివృద్ధికి పని చేస్తుంటే ప్రతిపక్ష నేతలకు మింగుడు పడటం లేదని విమర్శించారు. ఇకనైనా మాజీ మంత్రి తప్పుడు ప్రచారం మానుకోవాలని ఎమ్మెల్యే వసంత హితవు పలికారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

పోరాటనగర్(మైలవరం): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం పోరాటనగర్‌లో రూ.50 లక్షలతో సిమెంట్ రహదారుల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 20వేల మందికి పైగా ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేశామన్నారు.

దేవతామూర్తులకు శాకంబరి అలంకరణ



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

పెనుగొలను(గంపలగూడెం): ఆషాఢమాసం ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా పెనుగొలను పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో దేవతామూర్తులకు ఆదివారం శాకంబరి అలంకరణ చేశారు. రామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకులు దాములూరి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో గణపతి, వీరంబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మ, ఈశ్వరమ్మకు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి రంగు సత్యనారాయణ పాల్గొన్నారు.